
క్రేన్ కథోత్సవం - 2006
కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి
పొందిన కథ

# మేడిపండు



పి. పాపిరెడ్డి

పచ్చని దుప్పటి పక్కనబెట్టి ఒళ్ళు విరుచుకుంటూ పైకి లేచాడు దినకరుడు. అరుణ కిరణాలతో పులకరించిన ప్రకృతి దినచర్యకు ఉపక్రమించింది. పల్లెజనం బ్రతుకుదెరువు కోసం పరుగులు పెడుతుంటే మండల కార్యాలయంలో ప్రజానాయకులు విద్యాకమిటీలు కుకింగ్ ఏజన్సీల మీద కుస్తీలు పడుతున్నారు. మండలాధ్యక్షులు కప్పగంతుల పానకాల గారు మందహాసంతో సన్నివేశ సారస్యాన్ని నిశ్శబ్దంగా

ఆస్వాదిస్తున్నాడు.

యం.ఇ.ఓ.గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మోహనరావు మండలాధ్యక్షుల వారి దర్శనానికి వచ్చాడు. కప్పగంతులవారి గుబురు మీసాలలో నుండి తొంగి చూచిన మందహాసం, వారి ముఖంలోని వికాసం మోహనరావుకు ఎంతగానో నచ్చి వారిపై తొలిచూపులోనే విపరీతమైన గౌరవం, వల్లమాలిన అభిమానం కల్గినవి. గౌరవాభిమానాలతో బాటు తన బాధ్యత తాలూకు ఉత్సాహం గుండెల నిండా నిండగా, విద్యా విషయకంగా మండలాధ్యక్షుల వారి సంపూర్ణ సహకారాన్ని అర్థించాడు మోహనరావు. కప్పగంతులవారు తనకు వ్యక్తుల కంటే మండలం ముఖ్యమనియు అధ్యక్షునిగా మండల సర్వతోముఖాభివృద్ధియే తన జీవిత లక్ష్యమని ఖండితంగా విశదీకరించే సరికి మోహనరావు మనసు మయూరనృత్యం చేసింది.

మండలాధ్యక్షులవారి ఆశీర్వాదం తీసుకున్న మోహనరావు తన మండల పరిధి లోని పాఠశాలలప్రగతిని దర్శించడానికి బయలు దేరాడు. పక్క ఊరికి వెళ్ళి పాఠశాల గురించి వాకబు చేయగా మేకలు, గొర్రెల మధ్య కునుకు తీస్తున్న ఒక చిన్నపూరి పాకను చూపారు. అక్కడక్కడ పడి ఉన్న పలకలు, చిందరవందరగా ఉన్న సంచులు, గోలీలు ఆడుకుంటూ గోల చేస్తున్న పిల్లలూ అది పాఠశాలేనని ఋజువు చేస్తున్నారు. కొత్తవ్యక్తిని చూసి నిశ్శబ్దంగా నిలుచున్న పిల్లలను "మీ పంతులేరి బాబు?"అని అడిగాడు మోహనరావు.

"ఇంకా బస్సు రాలేదుగా ఎట్లా వస్తాడు?" అన్నాడొకడు, అంతమాత్రం తెలియదా అన్నట్లు.

అంతలో పరుగెత్తుకుంటూ వచ్చిన పంతులు "బస్సు లేటయింది సార్" అంటూ సంజాయిషీతో కూడిన సమాధానం చెప్పి హాజరుపట్టీ ముందుంచాడు. రోల్ 40 మంది, హాజరు 15 మంది. మోహన్‌రావు చిన్న చిన్న ప్రశ్నలు అడిగి చదువుకు వారికి సంబంధం లేదని గుర్తించాడు.

మోహన్‌రావు పంతులువైపు తిరిగి "మీరు ఎక్కడి నుండి వస్తుంటారు?" అని అడిగాడు

"పక్కన ఉన్న టౌన్ నుండి సార్"

"ఇక్కడ ఉండ లేకపోయారా?"అన్నాడు మోహన్ రావు.

పంతులు కాస్త ఇబ్బందిగా నవ్వి "ఇక్కడ ఎక్కడండీ, వసతైన ఇల్లు దొరకదు, పైగా పిల్లలు చదువుచున్నారు కూడా'' అన్నాడు.

"ఏం చదువుతున్నారు?"

''పెద్ద వాడు మూడు, రెండవవాడు యు.కె.జి., అమ్మాయి యల్.కె.జి. అందరూ ఇంగ్లీషుమీడియమే సార్"అన్నాడు కాస్తంత గర్వంగా.

మోహన్‌రావు నవ్వుతూ అన్నాడు. "కాన్వెంట్‌లో పంతుళ్ళకు వెయ్యి రూపాయల కంటే ఎక్కువ ఇవ్వరని మీకు తెలుసు మీరు తీసుకునేది ఏడెనిమిది వేలకు పైనే మీకు చెప్పను రాదా? లేక మీ చదువు మీ బిడ్డలకు పనికిరాదా? మీ బిడ్డల భవిష్యత్ గురించి ఎంతో ఆశగా ఎదురు చూసే మీరు, మీ చేతిలో పెట్టిన ఈ బిడ్డల గురించి ఎప్పుడైనా ఆలోచించారా? ఒక్కప్రక్క మీబాధ్యతను విస్మరించి ఈ బిడ్డలకు అన్యాయం చేస్తున్న మీరు మరో ప్రక్క మీ బిడ్డల బంగారు భవిష్యత్ గురించి కలలు కంటున్నారు. ముష్టి చెట్టును నాటుకొని మామిడికాయలు కాస్తుందని ఎదురు చూడడం అవివేకం మీరిక్కడ కాపురం పెట్టి మీ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించండి. మీ బిడ్డలకు కూడా సరైన న్యాయం జరుగుతుంది".

పంతులుగారి హృదయంలో ఎక్కడో అట్టడుగు పొరలలో అవసాన దశలోఉన్న అంతరాత్మ కొంచెం కళ్ళు విప్పినట్లు అనిపించింది.

మరో పాఠశాలకు వెళ్ళాడు మోహన్‌రావు. పలకలూ, పేడ తట్టలూ ఉన్నాయి గాని పంతులూ, పిల్లలు మాత్రం లేరు. పంతులు గారెక్కడా అని పరకాయించి చూస్తే ఆ ప్రక్కనే గ్రామస్తులతో ప్రస్తుత రాజకీయ సంక్షోభం

---

2005 రామాకవితల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కవిత.

## మహావృక్షం.... మరణవాంగ్మూలం

జననం ఆదిగా
నిశ్శబ్ద నిశీధి - నిరంతర వర్షం
ఎర్రటి ఎండ - చిక్కటి చలి
స్థితి ఏదైనా అలుపెరుగని కృషి
చిన్ని చిన్ని భాగాలపై ఉన్నత బాధ్యత
దృష్టంతా పరోపకారంపైనే - ఎంత శ్రమ ?
అదే తృప్తి, ఆనందం - మాకు
అదే గమ్యం, లక్ష్యం కూడా
మా మనుగడ మీకు ఆధారమట -
నిజంగా నిజం కదూ !
అయినా మీ అందం, ఆరోగ్యం, ఆనందం
ఇలా అన్నింటా మేమై
సర్వం మరచీ విడిచీ
మీకు జీవితాన్నిస్తే - ఫలితం
మా కుత్తుకలపై - గొడ్డళ్ళ కరాళనృత్యం
మా మొదళ్ళలో రంపాల లయ విన్యాసం
ఉపకారానికి అపకారం ఆచారంగా కల
నరశరీర మృగజాతి మీది
నిస్సిగ్గు అపచారానికి ప్రతిఫలం
మీ సమూల నాశనం
ఇది మా వృక్ష సహజాతుల
మహోగ్ర శాపం !

**- ఎం.పి.రమేష్‌బాబు**

గురించి తీవ్రస్థాయిలో చర్చిస్తున్న వ్యక్తి కనిపించాడు. పంతులుగారు, చేతులు కడుక్కొని నిక్కర్లకు తుడుచుకుంటూ పిల్లలు ఒక్కసారే బడిలోకి ప్రవేశించారు.

"ఏమిటండీ ఈ తట్టలు?" అడిగాడు మోహన్‌రావు.

"ఏముంది సార్, బడికి వచ్చేటప్పుడు వీళ్ళు ఒక చేత్తో పలక, మరొక చేత్తో పేడతట్ట పట్టుకొస్తారు. జంగిడి బర్రెలు బయలుదేరే సరికి పలకలు వదిలేసి తట్టలెత్తుకొని వెళ్ళిపోతారు. తట్ట నిండితే గాని తిరిగిరారు. ఏమిటయ్యా ఇదని పెద్దలను ప్రశ్నిస్తే 'చదువులేమి సాకుతాయా సార్, పేడవేసుకుంటే బతుకుతాం కాని' అన్నారు. ఇట్లా అయితే కొంతసేపైనా కూర్చుంటారని నేనే వారితో రాజీపడ్డాను".

"మధ్యాహ్న భోజనమో?"

"అదీ వివాదంలో పడింది సార్. రెండు వర్గాల వారు మేమంటే మేమని చేస్తే ఇద్దరూ చేస్తారు మానుకుంటే ఇద్దరు మానుకుంటారు. యం.ఆర్.ఓ గారికి తెలియజేస్తే ఆయన "విచారిస్తున్నాను" అంటాడు. ఆ విచారణ ఎప్పుడు పూర్తవుతుందో, ఇది ఎప్పుడు గాడిన పడుతుందో ఆ భగవంతుడికి తెలియాలి".

మోహన్‌రావు తలపట్టుకు కూర్చున్నాడు బాధగా. ఇలాంటి ప్రజలతో, ఇలాంటి పంతుళ్ళతో తరగతి గదులలో గాంధీ కలలు గన్న The Destiny of Nation రూపుదిద్దుకోవడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందో ఎవరు చెప్పగలరు!

"అందుకే ఒక పెద్దాయన - పిల్లలకు కాదు ముందు పెద్దలకే పెట్టాలి బడి - అన్నాడు. సరే పంతులుగారు! ఎన్ని ఇబ్బందులు ఉన్నా, ఏ వసతి ఉన్నా లేకపోయినా, ఏదో మంచి చేయాలన్న తపన మనకు ఉంటే ఈనాడు కాకపోయినా ఒకనాటికి ఈ పరిస్థితులు మారకపోవు. మనం అనుకున్న లక్ష్యం సాధించకుండా పోము" అంటూ మోహన్‌రావు మరో స్కూలు వెళ్ళాడు.

ఆ పాఠశాలలోప్రవేశించగానే ఎండలో పడి వచ్చిన బాటసారికి చల్లని మామిడి తోటలో కాలు పెట్టినట్లుగా అన్పించింది. పిల్లలందరూ శ్రద్ధగా చదువుకుంటూ వ్రాసుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయుడు 5వ తరగతి పిల్లలకు పాఠం బోధిస్తున్నాడు. పాఠం కొనసాగించమని చెప్పి వింటూ కూర్చున్నాడు మోహన్ రావు. విద్యార్థుల మెదడుకు పదును పెడుతూ మృదు మధురమైన మాటలతో నన్నుటి సెలయేటి జాలులా సున్నితంగా, సునిశితంగా సాగుతున్న పంతులు గారి బోధన తన చిన్ననాటి ప్రకాశం పంతులును జ్ఞాపకం తెచ్చింది. ఉపాధ్యాయుడు విద్యార్థి యొక్క ప్రథమ పాఠ్య పుస్తకమన్న - సూక్తికి సజీవ చిత్రం ప్రకాశం పంతులు గారు. పసి తనంలో ఆయన ప్రభావం వల్లనే తాను ఉపాధ్యాయ వృత్తిలో చేరడం ఆ వృత్తికి అంకితమైన వ్యక్తిగా గుర్తించ బడడం జరిగింది. యం.ఇ.ఓ.గా పదోన్నతి పొందగానే తన మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలన్న సదాశయంతో నడుంకట్టి రంగంలోకి దిగాడు మోహన్‌రావు.




ఉగాది వేడుకల్లో భాగంగా 26-03-07న ఇంటర్నేషనల్ క్లబ్ బి.హెచ్.ఈ.ఎల్. రామచంద్రాపురం, హైదరాబాద్‌లో పలువురు సాహితీ అభిమానుల నడుమ కవిసమ్మేళనం జరిగింది. చిత్రంలో ఎడమ నుండి కుడికి శ్రీ కవిరాజు, శ్రీ చంద్రశేఖరరెడ్డి, శ్రీ కె.నివేదన్, డా॥ద్వా.నా.శాస్త్రి, శ్రీమతి జి. విజయలక్ష్మి, ప్రసంగిస్తున్న డా॥ అద్దేపల్లి రామమోహనరావులు చిత్రంలో ఉన్నారు.

కాని తన ఆశయాలు మరీచికలైనాయని మధనపడుతున్న సమయంలో ఎడారిలోని వయాసిస్సులా పురుషోత్తం పంతులు తటస్థ పడ్డాడు.

తను తెప్పించిన భోజనానికి ఎంత వారించినా వినకుండా డబ్బులు ఇస్తున్న మోహన్‌రావును వింతగా చూశాడు పురుషోత్తం. తన సర్వీసులో అవీ ఇవీ తెప్పించుకొని తిని, వెడుతూ వెడుతూ మామూళ్ళ కోసం చేతులు జాపే అధికారులను మాత్రం చూసాడు గాని, మోహన్‌రావులాంటి నిజాయితీపరుడు తనకింతవరకు తటస్థ పడలేదు. ఒకేజాతి పక్షులు ఒకేగూటికి చేరుకున్నంతఆనందపడ్డారు ఇద్దరు.

మండలంలోని పాఠశాలల దుస్థితి, ప్రజల అజ్ఞానం, పంతుళ్ళ బాధ్యతా రాహిత్యం, ప్రభుత్వ అలసత్వం, రాజకీయజోక్యం ఇత్యాది సమస్యల గురించి ఇద్దరూ ఎంతోసేపు ముచ్చటించుకున్నారు.

ఉపాధ్యాయవృత్తికి అంకితమైన వ్యక్తులు చాలా కొద్దిమంది. విధిలేక వేరే మార్గం లేక ఈ వృత్తిని స్వీకరించినవారు చాలామంది. వారు ఇతర ఉద్యోగుల చీకటి ఆదాయాలను తలచుకొని తమ వృత్తిని నిందించుకొంటూ, ఇతరత్రా ఉపవృత్తులలో నిమగ్నమై, ధనసంపాదనలో వారితో పోటీ పడడానికి ప్రయత్నిస్తున్నారు గాని, పసివాళ్ళను ఆకట్టుకొని, వారి హృదయ క్షేత్రాలలో భారతీయ సంస్కృతీ బీజాలునాటి, వాటిని ఫలవంతం చేసి, ఆనంద పడే కృషీవలులు కాలేకపోతున్నారు. "ఇవి నేను వెలిగించిన దీపాలు" అని సమాజం ముందు నిలబెట్టి తమ వృత్తి ఔన్నత్యాన్ని సగర్వంగా చాటి చెప్పలేకపోతున్నారు. ఇది జాతికి పట్టిన దురదృష్టం. మోహన్‌రావు ఆవేదనలో పంతులు గూడా పాలు పంచుకున్నాడు.

ఆ సాయంకాలం మరి రెండు పాఠశాలలు చూచాడు మోహన్‌రావు. ఒకదానిలో ఉపాధ్యాయుడు నెలకు రూ.500/-లు ఇచ్చి తన సొంతంగా నియమించిన ఒక నిరుద్యోగి విద్యాబోధన చేస్తూ కనిపించాడు. అసలు ఉపాధ్యాయుడు కాంట్రాక్టు పనులలో నిమగ్నమై దేశాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిసింది.

మరో పాఠశాల చూడాల్సిన పనే లేకపోయింది. మూడు నెలల నుండి ఆ పాఠశాల మూసి ఉందట. సదరు పంతులుగారు ముత్యాల వ్యాపారం వెళ్ళినట్లు పే బిల్లులు, అక్విటెన్స్‌లు, యం.ఆర్.లు ఏ పొరపాటు లేకుండా అన్నీ అడ్వాన్సుగా సిద్ధం చేసి ఆఫీసులో ఇచ్చి వెళ్ళినట్లు తెలిసింది.

తను ఎప్పుడు విననికనని ఈ వింతలు చూసి నిశ్చేష్టుడైనాడు మోహన్‌రావు.

ఈ దురన్యాయాన్ని రూపుమాపాలనే ధృడసంకల్పంతో మండలాధ్యక్షులవారిని కలుసుకొని, కాంట్రాక్టు పంతులు,ముత్యాల పంతులుపై కఠిన చర్యలు తీసుకోవలసినదిగా గట్టిగా కోరాడు. అన్యం పుణ్యం ఎరుగని కన్నబిడ్డని చూసి తల్లి నవ్వినట్లుగా నవ్వాడు పానకాలు.

"భలేవారండీ మోహన్‌రావుగారు ఆయన మన పార్టీ ఆర్థిక వ్యవస్థకు మూలస్థంభం. అంతేగాక ఐదూర్లను మొత్తంగా కొనేసి ఓటర్లతో ప్రమేయం లేకుండా టోటల్‌గా పోల్ చేయించిన మహానాయకుడు. అలా అని పాఠశాలల పనిని ఆపకుండా, అందుకొక సులువైన మార్గం కనుక్కొన్న మేధావి. అందుకాయనను అభినందిచాల్సిందిపోయి ఆగ్రహిస్తావేందయ్యా?" అన్నాడు పానకాలు.

మోహన్‌రావుముఖం కందగడ్డ అయ్యింది. "అయితే ఆ ముత్యాల పంతుల సంగతండీ?" అడిగాడు అదెట్లాన్యాయమో తెలుసుకుందామని.

."ఓహో ఆయనా" అంటూ కక్కడికి చక్రవివరాలు బోధిస్తున్న బ్రహ్మంగారిలా ఎత్తుకున్నాడు పానకాలు, "కాంట్రాక్టు పంతులు మన ఆర్థిక వ్యవస్థకు మూలస్థంభమైతే, ఈ ముత్యాల పంతులు మన పార్టీ ఆలయానికి ధ్వజస్థంభంలాంటివాడు. మూడు నెలలు వ్యాపారం వెళితే నేమి, మిగతా తొమ్మిదినెలలు పార్టీ వ్యవహారాలలో చురుగ్గా పాల్గొనే కార్యకర్త. ఒక్క పాఠశాలకే పరిమితంగాకుండా పార్టీ ఇచ్చే శిక్షణా తరగతులకు క్రమం తప్పకుండా హాజరై, మండల కార్యకర్తలందరికీ శిక్షణ ఇచ్చి తన ప్రతిభాపాటవాలతో మండలానికి బహుముఖ సేవలందించిన మేటిపంతులు ఆయన. ఆయన శిక్షణలో ఆరితేరిన కార్యకర్తలవల్లనే గత ఎన్నికలలో బ్రహ్మాండమైన మెజార్టీతో ప్రజలు మనకు బ్రహ్మరథం పట్టారు."

కేవలం విద్యాభోధనలో తనవిద్వత్తును వ్యర్థం చేసుకోకుండా భారతప్రజానీకానికి వారొనర్చిన బహుముఖసేవలు గుర్తించలేని తన అజ్ఞానానికి కించిత్తు చింతించాడు మోహన్‌రావు.

తాను అనుకున్నది ఒకటి, జరిగింది మరొకటి.

చంద్రమతి వేషం వేసుకొని చింతామణి పద్యాలు పాడినట్లుంది.

"అంతేగాదయ్యా మన మండలానికి మహర్దశ పట్టబోతుంది. కొద్ది రోజుల్లో 100% అక్ష్యరాస్యత సాధించే దిశలో సాగుతుంది". ఆశ్చర్యంగా చూశాడు మోహన్‌రావు. "ఆ లక్షణాలు ఎక్కడా కనపడలేదే" అన్నాడు మామూలు ధోరణిలో.

"మంచోడివయ్యా మోహన్‌రావు ! నిన్న గాక మొన్నొచ్చిన నీకేమి తెలుసు. అంగన్‌వాడీలు, అనియత కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు, యం. యల్.ఓ.లు, యం.ఆర్.పి.లు, అధికారులు, అనధికార్లు నిర్విరామంగా కృషి చేసి అక్షర ప్రకాశంలో మన మండలాన్ని ఉత్తమ మండలంగా తీర్చిదిద్దారు".

మోహన్‌రావుకు అంతా అయోమయంగా ఉంది.

తనకు తెలియని ప్రపంచంలో తనకు రాని భాషలో ఒక వింత నాటకాన్ని చూస్తున్నట్లుగా ఉంది.

"ఏమిటి సార్ మీరుచెప్పేది? పంతుళ్ళే సరిగా బడికి రాక, వచ్చినా వారకార్థంగా వర్క్ చేస్తుంటే, మీరేమో నమ్మశక్యం కాని విషయాలు వల్లెవేస్తున్నారు" అన్నాడు కాస్త ధైర్యంగా.

పానకాలుగారు భల్లున నవ్వి "నీవు మన కులపోడివి కనుక చెప్తున్నాను. అంగనవాడీలు, అనియత కేంద్రాలు, ఎయిడ్స్ నివారణ కేంద్రాలు ఇవన్నీ నిర్వహించేది ఎవరనుకున్నావు? మా బావమరిదే. ఆయన స్థాపించిన స్వచ్ఛందసంస్థ ద్వారానే ఈ ప్రజాసేవ జరిగేది. మా తమ్ముడే యం.యల్.ఓ., మా మరదలు అంగన్‌వాడీ సూపర్‌వైజర్, మా ఆవిడ గ్రామ సర్పంచ్, మా బంధువులందరూ రకరకాల హోదాలలో పనిచేస్తున్నారు. అన్నీ ఆ కుటుంబానికేనా అని గోలచేస్తారని నిధులన్నీ గోప్యంగా ఖర్చు చేస్తున్నాము. పంతుళ్ళంటావా, వాళ్ళు 'మళ్ళీ బడికి', 'చదువుకుందాంరా', 'గాలిపటాలపండుగ' వగైరాలు సక్రమంగా నిర్వహించడమే కాక విద్యాశాఖవారి శిక్షణ కార్యక్రమాలకు హాజరు కావలసిరావడంతో బడికి వెళ్ళే అవకాశాలు చాలా అరుదుగా లభిస్తాయి. కనుక మనకు బళ్ళల్లో పంతుళ్ళు సహజంగా కనపడరు. అంత మాత్రం చేత విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారనుకుంటే అది అవగాహనారాహిత్యమే. గ్రామాలకు వెళితే నీకు ఏమి తెలుస్తుందయ్యా, కాగితాలు చూసుకో, అన్ని కరెక్టుగా ఉంటాయి."

'సునామీ'లో సర్వం కోల్పోయిన వాడిలా నిర్వేదంగా నిలబడ్డాడు మోహన్‌రావు.

"నాకు ఉపాధ్యాయులంటే చెప్పలేనంత అభిమానం. అందుకే ఏదో ఒక సందర్భం చూసుకొని వారిని సన్మానిస్తుంటాను. మీరు కూడా నా ఆశయాలతో ఏకీభవిస్తారని నాకు తెలుసు. ఆ కాంట్రాక్టు పంతులు గారిని మండల ఉత్తమ ఉపాధ్యాయునిగా రికమండ్ చేయండి" అన్నాడు పానకాలగారు.

'మరి ముత్యాల పంతులో?' అన్నాడు మోహన్‌రావు వ్యంగ్యం ధ్వనించకుండా.

"స్టేట్‌అవార్డుకు రికమండ్ చేయండి."

పానకాలుగారి సమయస్ఫూర్తికి, బహుమతి గ్రహీతల నిర్ణయంలో వారు చూపిన సమయోచిత ప్రజ్ఞకు అను(వన)చర వర్గం ముక్కుమీద వేలేసుకుంది.

మోహన్‌రావు మాత్రం హీరో చేతిలో దెబ్బ మీద దెబ్బ తిని డీలాపడ్డ విలన్‌లా కుర్చీలో కూలబడ్డాడు.

సుషుప్తావస్థలోఉన్న మోహన్‌రావుకు అస్పష్టంగా వినిపించాయి.

"ముక్కు మూసుకొని జపం చేసుకోక వీళ్ళకెందుకో ఉద్యోగాలు".